క్లుప్తంగా

పెదపేటలో రెవెన్యూ గ్రామసభ

రోలుగుంట : పెదపేట గ్రామంలో బుధవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.నాగమ్మ భూ సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అర్జీలు అందజేశారు. వారి వివరాలను ఆర్ఐ రామ్మూర్తి నమోదు చేసుకున్నారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు, రైతులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టండి


కార్యదర్శులతో సమీక్షిస్తున్న సీతామహాలక్ష్మి

మాకవరపాలెం : గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అన్ని పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందించే తాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. అలాగే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శనివారం సచివాలయ సిబ్బంది సచివాలయ పరిసరాలను శ్రమదానంతో శుభ్రం చేయాలన్నారు.

తూటిపాలలో హరిత దీపావళి


హరిత దీపావళిలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం : అందరూ పర్యావరణ రహిత దీపావళిని జరుపుకోవాలని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం రాము కోరారు. గురువారం దీపావళి నేపథ్యంలో బుధవారం పాఠశాలలో హరిత దీపావళి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రకరకాల క్రాకర్స్, బాంబుల వల్ల కలిగే నష్టం, శబ్ద కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శబ్ద కాలుష్యం వల్ల పక్షులు దూరంగా వలస పోతున్నాయన్నారు. పర్యావరణ మార్పుల వల్ల వాటి సంతాన ఉత్పత్తి కూడా తగ్గిపోతుందన్నారు. పర్యావరణ రహిత దీపావళి లక్ష్యంగా దీపాలు వెలిగించి ఈ హరిత దీపావళిని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

23 బాణసంచా దుకాణాలకు అనుమతులు


ఫైర్ అధికారి రాజేశ్వరరావు

మాడుగుల: మండలంలో 23 బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందని, ఫైర్ అధికారి వి.రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీపావళికి సంబంధించి అనుమతులు పొందిన షాపుల వద్ద 200 లీటర్లు గల డ్రమ్ములో నీరు, 3 బస్తాలు ఇసుక అందు బాటులో ఉంచాలన్నారు. స్టాల్‌కు, స్టాల్‌కు నడుమ సుమారు 5 మీటర్ల దూరం ఉంటేలా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. చిన్నారులు టపాసులు వినియోగించేటప్పుడు పెద్దవారు దగ్గర ఉండాలన్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతలకు సీఐ అభినందన

నర్సీపట్నం: మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకాలు సాధించిన విజేతలను టౌన్ సీఐ జి.గోవిందరావు అభినందించారు. టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న తెనాలిలో జరిగిన పోటీల్లో ఆర్‌పి మార్షల్ ఆర్ట్స్ అకాడమి విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్.హేమంత్, ఎన్.తనుష్‌చంద్ర, ఎ.మనోజ్‌కుమార్, జి.పూజ్య హన్విత బంగారు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు, ఎస్.యోషిత రజత్ పతకం, ఎన్.హనైతీ కాంస్య పతకం సాధించారు. వీరిని టౌన్ సీఐ గోవిందరావు అభినందించారు.

ఐకమత్యంగా జీవించాలి

చీడికాడ: గ్రామాల్లో అందరూ కలసిమెలసి జీవించాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మరువాడ ఈశ్వరరావు అన్నారు. బుధవారం పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా తురువోలు ఎస్సీ కాలనీలో సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు అందించిన డీ-ఫారం భూములకు జూరెడ్డి వాని చెరువు నుంచి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.

నిండుగా చెరువులు... పచ్చగా పొలాలు


నిండుకుండలా ఉన్న పోతనవలస పెద్ద చెరువు

- ఖరీఫ్ సాగుకు పుష్కలంగా నీరు
- దిగుబడిపై రైతుల ఆశలు


పచ్చగా కళకళలాడుతున్న వరిపంట

కె.కోటపాడు : పలు గ్రామాల్లో గల సాగునీటి చెరువులు నిండుకుండల్లా నీటితో దర్శనమిస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు మార్లు బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడన ద్రోణి కారణంగా కురిసిన వర్షాలకు మండలంలో పలు ప్రధాన సాగునీటి చెరువుల్లోనికి వర్షపునీరు పుష్కలంగా వచ్చి చేరింది.

15వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి

మండలంలో ఖరీఫ్ సాగులో ఉన్న 15వేల ఎకరాల్లో వరి పంట, 3వేల ఎకరాల్లో గల చెరకు పంటకు కురిసిన వర్షాలు మేలు చేశాయి. అధిక వర్షాల కారణంగా వరిపంటకు అడపాదడపా తెగుళ్ళు బారిన పడ్డా రైతులు సస్య రక్షణ చర్యలను చేపట్టడంతో తెగుళ్ల బెడద నుండి పంటను రక్షించుకున్నారు. చెరువుల్లో పుష్కలంగా ఉన్న వర్షపునీటి నిల్వలు వలన పంటలకు అవసరమయిన సమయాల్లో నీటిని అందించుకునే పరిస్థితి ఉంటుందని సాగు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగులో ఉన్న వరి, చెరకు పంటలతో మంచి దిగుబడిని సాధించగలమని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. పోతనవలసలో గల పెద్ద చెరువు, వి.సంతపాలెంలో నాగారాయుడి చెరువు, వారాడలో గల తుంగ చెరువు, ఎ.కోడూరులో గల రంగరాజు చెరువు, బత్తివానిపాలెంలో గల చెరువు నీటితో నిండుగా దర్శనమిస్తున్నాయి..

ఉచిత గ్యాస్ ముసుగులో విద్యుత్ ఛార్జీల పెంపు

ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నాయకుల ధర్నా


విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సీపీఐ నాయకుల ధర్నా

నర్సీపట్నం : తక్షణమే పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ దీపావళి నుండి ఉచితంగా గ్యాస్ బండలు పంపిణీ చేస్తామంటూ సామాన్య ప్రజలను ఊరిస్తుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వరుసగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నామని గ్యాస్ పంపిణీ ద్వారా సంకేతాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆరాటపడుతుందని విమర్శించారు. ఉచిత గ్యాస్ మాటున ప్రజలకు కనపడని వసూళ్ల దెబ్బ కొట్టడానికి ప్రభుత్వం సిద్ధపడుతుందని విమర్శించారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీలను గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలు కాకముందే విద్యుత్ ఛార్జీలను పెంచి వినియోగదారులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపిందన్నారు. రూ.607286 కోట్లు విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై రుద్దడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఛార్జీల పెంపుతో ప్రతి యూనిట్‌పై గరిష్ఠంగా రూ.1.58 అదనపు భారం పడనుందన్నారు. ఇప్పటికే బియ్యం, పప్పులు, వంట నూనె ధరలు విపరీతంగా పెరిగాయని తక్షణమే విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, కార్యవర్గ సభ్యుడు గొల్లు గురుబాబు, పాయకరావుపేట, గొలుగొండ, కోటవురట్ల మండల కార్యదర్శులు వెలుగుల అర్జున్, మేకా భాస్కర్, లింగంపల్లి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కొండలరావు, చొక్కా వీరబ్బాయి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్‌బాబు

కె.కోటపాడు : నిరక్షరాస్యులైన బ్యాంక్ ఖాతాదారులు సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని చౌడువాడ ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ కె.శ్రావణ్‌బాబు అన్నారు. చౌడువాడలో డ్వాక్రా సంఘాల్లో సభ్యులతో పాటు గ్రామస్తులకు బుధవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా పలు జాగ్రత్తలు ఆయన వివరించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌బాబు మాట్లాడుతూ బ్యాంక్‌లో ఖాతాలు కలిగిన వారు వారి ఏటీఎం పిన్, వన్ టైమ్ పాస్ వర్డు నంబర్‌ను ఎవరికీ చెప్పకూడదని ఆయన సూచించారు. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ నంబర్లను ఎటువంటి వారికీ కూడా ఖాతాదారులకు తెలపరాదని అన్నారు. కొన్ని సమయాల్లో బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఖాతాదారులకు ఫోన్‌లు చేసి సైబర్ మోసగాళ్లు ఆధార్, ఏటీఎం పిన్ నంబర్లు అడిగే పరిస్థితుల్లో వారికి వివరాలు చెప్పరాదని అన్నారు. ఈ నెంబర్లు చెప్పిన సందర్భాలలో ఆన్‌లైన్ ద్వారా ఖాతాలో గల నగదును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని శ్రావణ్‌బాబు తెలిపారు. ఇటువంటి మోసాల బారిన ఖాతాదారులు పడకుండా ఉండేందుకు ప్రతి ఏడాది అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాల ద్వారా ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి మల్లికార్జున్, అకౌంటెంట్ చిట్టి వికాస్, కేషియర్ అమర్‌నాథ్, వెలుగు వీవోఏలు పాల్గొన్నారు.

దేవస్థానం భూముల వేలం


బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న పాటదారులు

రోలుగుంట: అనివార్య కారణాలుగా వాయిదా పడిన శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతారాముల వారి దేవస్థానం భూముల బహిరంగ వేలం పాటను బుధవారం స్థానిక పాత రామమందిరం కల్యాణ మండపం వద్ద ఈవో ఆశా కిరణ్మయి వేలం నిర్వహించారు. సీతారాములస్వామి వారి రోలుగుంట రెవెన్యూలోని సర్వే నంబరు 107/2.3లో 3.70 ఎకరాలు, సర్వే నంబరు 210/2ఎలో ఎకరా, పెదబొడ్డేపల్లి రెవెన్యూ 295 సర్వే నంబరులో గల 0.33 సెంట్ల భూమిని కౌలు వేలం నిర్వహించారు. అయితే అనుకున్న మేరకు పాట కుదరక వాయిదా వేశారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన కొవ్వూరు రెవెన్యూ సర్వే నంబరు 35/2 లో గల 2.18 ఎకరాలు, 31 సర్వే నంబరులో గల 0.98 సెంట్లు, 30/1 సర్వే నంబరులో 1.33 ఎకరాలు, 35/4 సర్వే నంబరులో గల ఎకరా వెరసి ఐదెకరాల 49 సెంట్ల విస్తీర్ణానికి మూడు సంవత్సరాలకు ఏడాదికి రూ.30 వేలు చొప్పున ఆ తరువాత మరో మూడు సంవత్సరాల వరకూ 30 శాతం పెంచే షరతు మేరకు వేలం పాడుకున్నారు. కొవ్వూరుకు చెందిన ఇర్ల డేముడు అందరికన్నా అధిక కౌలుకి పాట దక్కించుకున్నట్టు ఈవో ఆశా కిరణ్మయి ప్రకటించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి కె.రాజసులోచన, సిబ్బంది భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

బురదగుంతలో నిలిచిపోయిన లారీ


మండల కార్యాలయం కూడలి నుంచి ఎంపీపీ పాఠశాల వరకూ ట్రాఫిక్ నిలిచిపోయిన వాహనాలు

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో మంగళ, బుధవారాలు జోరు వర్షాలు కురిశాయి. దీంతో దెబ్బతిని గోతులమయంగా ఉన్న వడ్డాది-నర్సీపట్నం (బీ.ఎన్) రోడ్డు రోతగా తయారై రవాణాకు అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావంతో నర్సీపట్నం వేపు వెళుతున్న లోడులారీ మంగళవారం రాత్రి స్థానిక మండల కార్యాలయం కూడలి దాటిన తరువాత ఎంపీపీ పాఠశాల సమీపంలో గల భారీ బురద గుంటలో కూరుకుపోయింది. దీంతో ఆ తరువాత వెనుక వచ్చిన మరో ఆరు లోడు లారీలు ఆగిపోయి ట్రాఫిక్ జామ్ అయింది. ఆ సమయంలో ఆ రాత్రి సుమారు 11 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో రాత్రంతా లారీలో ఉండి ఇక్కట్లు పడిన డ్రైవర్లు ఉదయం ట్రాక్టర్ల సాయంతో లారీని బురదలో నుంచి బయటకు తీశారు. ఈ మార్గంలో భారీ గోతులు పూడ్చి, రోడ్డు మరమ్మతులు చేసి రవాణా మెరుగుపరచాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రమిదలతో ప్రమోదం

నేడే దివ్వెల పండగ


సత్యవరంలో కుండలు తయారు చేస్తున్న దృశ్యం

మాడుగుల : దీపావళి అంటే ఇంటి చుట్టూ మట్టి ప్రమిదల వెలుగులు ఊరువాడా దీపాలతో సందడి నెలకొంటుంది. దీపావళికి వారం ముందుగానే మట్టి ప్రమిదలు చిచ్చుబుడ్డీలు, మట్టితో తయార చేసేవి అమ్మకాలు మొదలయ్యాయి. కొంతమంది ఇంటి వద్దే తయారు చేసి విక్రయిస్తారు. నేడు ఇత్తడి ప్రమిదలు, ఇతర రెడీమేడ్ దివ్వెలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. మార్కెట్‌లో గత ఏడాది కంటే ఈ ఏడాది టపాసులు అధిక ధరలకు విక్రయాలు చేయడానికి వ్యాపారులు సిద్ధం అవుతున్నారు. ఒకప్పుడు సత్యవరంలో సుమారు 150 కుటుంబాలు కుమ్మరి వృత్తులు చేసేవారు. కానీ ప్రస్తుతం 4 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తుల్లో ఉన్నారు. మట్టి కుండలకు ఆదరణ తగ్గడంతో కుమ్మర్లు వలస పోయి ఇతర వృత్తుల్లో స్థిరపడుతున్నారు. కుండలకు బదులు ఇత్తడి , స్టీల్స్, ప్లాస్టిక్ సిల్వర్ వస్తువులు అందుబాటులోకి రావడంతో కుండలు కొనుగోలు తగ్గిపోయింది. పూర్వం మట్టి కుండల్లో వంటకాలు ఆరోగ్యంగా ఉండేవని, ప్రస్తుతం సిల్వర్ అందుబాటులోకి రావడంతో మట్టితో తయారు చేసే పాత్రల వాడకం తగ్గిపోయిందని, తమకు జీవనోపాధి పోయిందని, కుమ్మరులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

పాఠశాలలో ముందస్తు దీపావళి సందడి


దివ్వెలు వెలిగిస్తున్న విద్యార్థినులు

కె.కోటపాడు : అయ్యన్న విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి వేడుకలను బుధవారం నిర్వహించారు. పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రాలతో విద్యార్థినులు దీపాలు వెలిగించారు. ప్రమిదల ఆకారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగ వల్లులను అలంకరించారు. విద్యాసంస్థల డైరక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, ప్రిన్సిపాల్ నూర్జహన్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: దీపావళి పర్వదినం సందర్భంగా, వేడుకలను ముందస్తుగా కె.జె.పురం అంగన్‌వాడీ కేంద్రం-1లో బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త పి. చంద్ర ఆధ్వర్యంలో దీపాలు వెలిగించి, కాకర పువ్వత్తులు వెలిగించారు. దీపావళి అవశ్యత గురించి వివరించారు. అంగన్‌వాడీ ఆయా నూకరత్నం పాల్గొన్నారు.

పౌరులంతా తమ హక్కులు పొందాలి

కె.కోటపాడు : సమాజంలో పౌరులంతా వారి హక్కులను పొందాలని కె.కోటపాడు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ బి.సూరి అన్నారు. ఎ.కోడూరు గ్రామంలో బుధవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సూరి మాట్లాడుతు ప్రతి పౌరుడు హక్కులను వినియోగించుకోవాలని, అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నిమ్నజాతుల వారిని కించపరిస్తే చట్టప్రకారం శిక్ష పడుతుందన్నారు.

టీడీపీ నాయకులకు దోచి పెట్టేందుకే నిధుల కేటాయింపు

- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
- సర్వసభ్య సమావేశంలో రచ్చ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం

నర్సీపట్నం : అభివృద్ధిపై కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన కౌన్సిలర్ మధ్య మాటల యుద్ధం నెలకొంది. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడడం సరికాదని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారని జనసేన కౌన్సిలర్ పేర్కొనడంపై మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతం ప్రభుత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధిని గాలికి వదిలేసి, దోచుకున్నారని, నాలుగు నెలల కాలంలో స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.4.20 కోట్లు తీసుకువచ్చారని కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి పేర్కొన్నారు. అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత టీడీపీ కౌన్సిలర్లకు లేదని వైస్‌చైర్మన్ ఎదురుతిరిగారు. టీడీపీ కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందకు జనరల్ ఫండ్ నుంచి ఒకేసారి రూ.1.75 కోట్లు కేటాయించారని వైస్‌చైర్మన్ విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రజల సొమ్మును టీడీపీ కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని టీడీపీ కౌన్సిలర్ల విమర్శలను తిప్పి కొట్టారు. 40 ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్ల కాలంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చేశారని వైస్‌చైర్మన్ పేర్కొన్నారు. టీడీపీ కౌన్సిలర్ల ఆరోపణలను మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి తిప్పికొట్టారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య మాటలతో కౌన్సిల్ సమావేశం రచ్చరచ్చగా మారింది. ఐదేళ్లలో అభివృద్ధి జరగలేదని టీడీపీ కౌన్సిలర్లు చేసిన వ్యాఖ్యలను చైర్‌పర్సన్ ఖండించారు. రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయించిన విషయం మరిచిపోవద్దన్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణకు జనరల్ ఫండ్ నుండే ఖర్చు చేయాలని కమిషనర్ స్పష్టత ఇచ్చారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో మాసశివరాత్రి పూజలు


స్వామివారిని దర్శించుకొని పూజలు చేసుకుంటున్న ఆలయ ధర్మకర్త పిల్లి చిన్నారావు, భక్తులు

రోలుగుంట : స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయంలో బుధవారం మాస శివరాత్రి పూజాకార్యక్రమాలను ఆలయ అర్చకుడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పిల్లి చిన్నారావు శతస్తోత్తర శివలింగాలకు హారతి ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా వచ్చే మాసశివరాత్రి రోజు స్వామివారికి పూజలు చేసి ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుంది. నెల రోజుల పాటు ఈ ఆలయం వద్ద పూజాభిషేకాలు జరుగుతాయని తెలిపారు.

వరిపంటలో సస్య రక్షణ చేపట్టాలి

మాడుగుల రూరల్: వరి పంట పొట్టదశలో ఉన్నందున ఈ దశలో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా, వీరవల్లి, పోతనపూడి, గ్రామాల్లో బుధవారం పంట పొలాల్లో క్షేత్ర స్థాయిలో సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ పథకం విధి విధానాల గురించి తెలిపారు.

ప్రతి ఇంటా ఆనంద కాంతులు నిండాలి

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి: దీపావళి పండుగ రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. తారువలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. వెలుగుల పండగ దీపావళి ప్రతి ఇంటా ఆనందాల సిరులు, సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు నింపాలని ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. ప్రజలంతా దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

గ్రామసభలో 14 దరఖాస్తులు

నాతవరం : మండలంలో పి.జగ్గంపేట గ్రామ పంచాయతీలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులు నుంచి 14 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. భూ రీసర్వేలో జరిగిన లోపాలను సరి చేస్తామని అలాగే పంచాయతీలో రైతులు ప్రధాన భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభ ఎంతోఉపయోగ పడుతుందన్నారు.

ఆయుష్ సూత్రాలపై అవగాహన అవసరం


ఔషధ మొక్కలపై అవగాహన కల్పిస్తున్న హరిపాలెం ఆయుష్ వైద్యాధికారి శిరీషా

నాతవరం : కాలానుగుణంగా వస్తున్న వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలని హరిపాలెం ఆయుష్ వైద్యాధికారి టి.శిరీష అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో బుధవారం జాతీయ ఆయుష్ మిషన్ విభాగం వారితో ఆరోగ్య సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్ ద్వారా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మధుమేహం నియంత్రణ పోషణ్, జీవనశైలి ఔషధ మొక్కలు గృహ వైద్యం యోగ గురించి ఆశ కార్యకర్తలకు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ అంశాలను గ్రామాల్లో ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకువచ్చే బాధ్యత ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందిదే అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే ఆయుష్ సూత్రాల ఆశయాలను అమలు చేసేందుకు అందరూ అంకిత భావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెయిరీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : విశాఖ డెయిరీ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తూ స్వలాభం కోసం పని చేస్తోందని ఆరోపించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పాడి రైతుల ఆర్థిక అభ్యున్నతికి విశాఖ డెయిరీ అప్పట్లో పెద్దలు స్థాపించారన్నారు. ప్రస్తుతం డెయిరీ వాణిజ్యపరంగా మారిపోయిందన్నారు. పాల ధర తగ్గించడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. విశాఖలో విలువైన 7.95 ఎకరాల భూమిని డెయిరీ అక్రమించిందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కలెక్టర్ తక్షణమే విచారణ చేపట్టాలన్నారు.

జిరాయితీ భూములే విక్రయించాం

మాడుగుల రూరల్ : మండలంలో లోవకృష్ణాపురం శివారు ఓంద్రు వీధి గ్రామానికి చెందిన డి.ఫారం పట్టా భూములు, ఇతర వ్యక్తులకు విక్రయించారని మంగళవారం స్థానిక తహసీల్దారుకు కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవం లేదని గ్రామస్తులు బుధవారం మాడుగులలో స్థానిక విలేకరులకు తెలిపారు. అనంతరం తహశీల్దారు రమాదేవికి వినతిపత్రం అందజేసారు. ఓంద్రు వీధి రెవెన్యూ సర్వే నెంబరు 81-84 లో 13 ఎకరాలు జిరాయితీ మెట్ట భూమికి సంబంధించి 30 మంది రైతులుకు జిరాయితీ భూమిని ప్రభుత్వం గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు అందజేసిందని, దీనిలో నలుగురు రైతులు మినహా, మిగిలిన 26 మంది రైతులు మా పూర్తి సమ్మతితో భూములు విక్రయించామని తెలిపారు.

మర్రివలసలో 36 అర్జీలు

కె.కోటపాడు : రీసర్వే గ్రామసభలో రెవెన్యూ సమస్యలపై అందించే ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది పరిశీలించి పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ భాగ్యవతి అన్నారు. మండలంలో మర్రివలస గ్రామంలో బుధవారం రీసర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 36 మంది అర్జీలను అందించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ బి.సూరి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, సర్పంచ్ అప్పలనర్సమ్మ, మాజీ సర్పంచ్ సూరిదేముడు పాల్గొన్నారు.

ఎం.కృష్ణాపురంలో 32 అర్జీలు

మాడుగుల రూరల్: ఎం. కృష్ణాపురం గ్రామంలో బుధవారం రీసర్వే రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. మండల రీసర్వే డీటీ కె. గణపతిరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన రీసర్వేలో తప్పుఒప్పులు ఉంటే వెంటనే లిఖిత పూర్వకంగా తెలియపర్చాలని, 15 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు.